సంపుటి: 3 | సంచిక: 5

జూలై - ఆగష్టు, 2015

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



Happy Independence Day



# "మనస్సులోని మాట"

**క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.**

దేవునియందు ప్రియమైన ప్రతి ఒక్కరికి యేసుక్రీస్తు నామమున శుభములు. మన తండ్రియైన దేవుని యొద్ద నుండి కృపయు, సమాధానమును కలుగును గాక! జూన్ 1,2,3 తేదీలలో జరిగిన విశ్వాసుల కూడికలను ఆశీర్వాదకరంగా జరిగించినందుకు దేవునికి స్తోత్రములు. ఆయన మహిమలో మన ప్రతి అవసరతను తీర్చుచున్న ప్రభువునకు ఎల్లప్పుడూ కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసినవారమై యున్నాము.

క్రొత్త విద్యాసంవత్సరము ప్రారంభములో మనము ఉన్నాము. చదువుకుంటున్న పిల్లలు కొందరు స్కూల్స్ నుండి కాలేజ్‌లోకి అడుగుపెట్టుచున్న వారు, మరికొందరు ఇంటర్ నుండి డిగ్రీలోకి వెళ్ళుచున్నవారు. చదువులో మరియొక స్థాయిలోకి వెళ్ళడం మాత్రమే కాకుండా వారి యొక్క మానసిక పరిపక్వతలో కూడా ముందుకి వెళ్ళుట ఎంతో అవసరం. అప్పుడు వారు తమ ఇంటి వారికి, సమాజమునకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటారు. తద్వారా దేవునికి సంతోషమును కలిగించేవారిగా ఉండగలుగుతారు. అందుకే పౌలు భక్తుడు రోమా సంఘస్తులకు 12వ అధ్యాయములో ఈ విధంగా తెలియపరిచాడు. లోకమర్యాదను అనుసరింపక సంపూర్ణమైన దైవ చిత్తము ఏదో తెలుసుకొనునట్లు, మనస్సులో ఒక గొప్ప మార్పు అవసరం అని తెలియపరిచాడు. ఈ రోజులలో దేవుడు ఏది కోరుకుంటున్నాడో గ్రహించకుండా, దేవుని పేరట అనేక కార్యక్రమములలో ఎందరో మునిగిపోయి ఉన్నారు. వారు చేస్తున్న కార్యక్రమములు మానవుని హృదయములను పరిపక్వత లోనికి నడిపిస్తున్నాయా? లేదా? అనే ఆత్మ పరిశీలన చేసుకోవలసి ఉన్నది. దేవుని పేరట జరిగే ప్రతి కార్యక్రమమునకు ముఖ్య ఉద్దేశ్యము మనుష్యులలో మార్పు. అంతేగాని గొప్ప కట్టడములు, పేరు ప్రఖ్యాతులు మొదలైనవి కావు. ఈ సత్యమును బోధకులైన వారు, పరిచారకులు, ప్రతి వ్యక్తి గ్రహించిన యెడల ఎంతో మేలు.

అట్టి భాగ్యమును స్పర్శ పాఠకులమైన మనకు ప్రభువు అనుగ్రహించును గాక !

మీ సహోదరుడు.....



సంపుటి: 3 | సంచిక: 5

జూలై - ఆగష్టు, 2015

దేవుని

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...

మంచి సమరయుడు ........ 2
చదవండి - చదివించండి..... ........ 5
నోటి మాటలు (స్త్రీల ప్రత్యేకం) ........ 6
సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 41వ భాగము ........ 9
సోమరితనము (బాలల శీర్షిక) ........ 11
నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 13
పరలోకం ........ 15
సులభమైన ప్రార్థనా యొక్క శక్తి ........ 17
ఆశావాది ........ 19
ఓటమి బాధ్యత ........ 20
బైబిల్ క్విజ్-41 ........ 22
జన్మదిన శుభాకాంక్షలు ........ 23

మా చిరునామా:
ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# మంచి సమరయుడు

**- బ్రదర్. ఎపఫ్రా**

లోకములో విజయమునకు అందరూ స్నేహితులే, శత్రువులు ఎవ్వరూ ఉండరు. అలాగే అపజయమునకు అందరూ శత్రువులే మిత్రులు ఎవ్వరూ ఉండరు ఇది లోకం పోకడ.

మన సమాజములో రాజకీయ పార్టీలను చూచిన, వాణిజ్య సంస్థలను చూచిన ఒకటే లక్ష్యం విజయమును అందించేవారి కోసమే పోటీ పడుతూ ఉంటాయి, కాని సృష్టికర్తయైన దేవుడు ఓటమిలో ఉన్నవారికి మిత్రుడై, శ్రేయోభిలాషియై వారిని ఓటమి నుండి విజయములోనికి నడిపిస్తాడు. ఈ విషయమును గురించి బైబిల్ గ్రంథమును పరిశీలిస్తే యెరూషలేము అనే పట్టణం గురించి **"భూమి తోడన వద్దు, అది ఆయన పాదపీఠము, యెరూషలేము తోడన వద్దు, అది మహారాజు పట్టణము" మత్తయి 5:35.** యెరికో అనే పట్టణం గురించి **"ఎవడు యెరికో పట్టణమును కట్టించపూనుకొనునో వాడు యెహోవా దృష్టికి శాపగ్రస్తుడగును, వాడు దాని పునాది వేయగా వాని జ్యేష్ఠకుమారుడు చచ్చును, దాని తలుపులను నిలువనెత్తగా వాని కనిష్ఠకుమారుడు చచ్చును, యెహోషువ 6:26**

యెరూషలేము పట్టణము నుండి యెరికో వరకు సుమారుగా 25 కి.మీ దూరం. యెరూషలేము సముద్ర మట్టమునకు 800 మీటర్ల ఎత్తులో ఉంటే, యెరికో 250 మీటర్ల ఎత్తులో ఉంటుంది. అనగా ఈ పట్టణముల మధ్య ప్రయాణం ఏటవాలుగా ఉంటుంది.

ఒక మనుష్యుడు యెరూషలేము నుండి యెరికో పట్టణమునకు ప్రయాణమై వెళుతూ ఉన్నప్పుడు దొంగల చేతికి చిక్కియున్నాడు. దొంగలు అతని వస్త్రములను దోచుకొని, కొట్టి కొరప్రాణముతో విడిచిపోయారు. ఆ దారి గుండా యాజకుడు ప్రయాణిస్తూ, కొరప్రాణముతో పడి ఉన్న వ్యక్తిని చూచి ప్రక్కగా వెళ్ళి పోయాడు. ప్రాణం పోతున్న వ్యక్తిని చూచి ఎలా వెళ్ళిపోగలిగాడు? యాజకుడు అనగా దేవుని మందిరములో బలులు, అర్పణలు అర్పించే ముఖ్యుడు. ఇతడు దేవునికి మనుష్యులకు మధ్యవర్తి, కాని అతను అనుసరిస్తున్న ధర్మశాస్త్ర నియమము ప్రాణం పోతున్న వ్యక్తికి సహాయం చేయకుండా చేసింది. **యాజకులగు అహరోను కుమారులతో ఇట్లనుము - మీలో ఎవడును తన ప్రజలలో శవమును ముట్టుట వలన తన్ను అపవిత్ర పరచుకొనరాదు - లేవీ 21:2.** ఎక్కడ కొరప్రాణముతో ఉన్నవాడి ప్రాణం పోతే ధర్మశాస్త్రమును మీరిన వాడను అవుతాననే భయం.





ప్రతిరోజు నీకొక అదనపు అవకాశం. ఈరోజైన కదులు, సాధించు

యాజకుడు వెళ్ళిపోయిన తరువాత ఆ మార్గములో లేవీయుడు ప్రయాణిస్తూ ఉన్నప్పుడు దొంగల చేతికి చిక్కినవాడు పడియుండుట చూచి, ఏ మాత్రం పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు. లేవీయులు ఇశ్రాయేలు గోత్రీకులు. దేవుని మందిరపు ఉపకరణములను మోయునట్లుగాను ఇశ్రాయేలీయుల కానాను ప్రయాణంలో ప్రత్యక్షపు గుడారము విప్పడానికి, వేయడానికి వీరిని దేవుడు ఏర్పరచుకున్నాడు. వారు మందిరపు సేవ చేయుచు దాని చుట్టూ మాత్రమే ఉండవలసిన వారు. లేవీయులు దేవుని మందిర పనికి ప్రత్యేకపరచబడినవారు. లేవీయుడైన ఇతనికి కూడా సహాయపడడానికి మనస్సు లేదు. వారి వారి ధర్మశాస్త్ర నియమముల కొరకు ఉన్న శ్రద్ధ ప్రాణం పోతున్న వాడిని రక్షించడానికి లేదు.



సమరయుడు అదే దారిలో వెళ్ళుచున్నాడు. సమాజములో సమరయులు అనగా హీనమైన స్థితిలో ఉన్నవారు. ఎవరూ వారితో సాంగత్యం చేయడానికి గాని, వారు ఇచ్చిన నీళ్ళు త్రాగడానికి కూడా ఇష్టపడరు. ఇలాంటి అధమ స్థాయిలో ఉన్న వ్యక్తి ఉన్నతమైన ఆలోచనా విధానముతో కొరప్రాణముతో ఉన్న వాడిని రక్షించడం జరిగింది.

**“అయితే ఒక సమరయుడు ప్రయాణమై పోవుచు, అతడు పడియున్న చోటికి వచ్చి, అతనిని చూచి, అతని మీద జాలిపడి దగ్గరకు పోయి, నూనెయు ద్రాక్షారసమును పోసి అతని గాయములను కట్టి తన వాహనము మీద ఎక్కించి యొక పూటకూళ్ళ వాని ఇంటికి**

**తీసికొని పోయి అతని పరామర్శించెను. మరునాడతడు రెండు దేనారములు తీసి ఆ పూటకూళ్ళ వానికిచ్చి - ఇతని పరామర్శించుము. నీవింకేమైనను ఖర్చు చేసిన యెడల నేను మరల వచ్చునప్పుడు అది నీకు తీర్చెదనని అతనితో చెప్పిపోయెను. - లూకా 10:33 - 35**
అతనిని ఒక మనుష్యునిగా తీర్చిదిద్దే బాధ్యతను సమరయుడు తీసుకున్నాడు.

నేడు మనుష్యులు ఇలాంటి మనస్సు కలిగి ఎంతమంది జీవిస్తున్నారు? **ఏలయనగా మనమింక బలహీనమై యుండగా, క్రీస్తు యుక్త కాలమున భక్తిహీనుల కొరకు చనిపోయెను. నీతిమంతుని కొరకు సహితము ఒకడు చనిపోవుట అరుదు, మంచివాని కొరకు ఎవడైన ఒకవేళ చనిపోవ తెగింపవచ్చును! అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరచుచున్నాడు, ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మన కొరకు చనిపోయెను రోమా 5:6-8**

ప్రభువైన యేసు మానవాళికి ఇచ్చిన సందేశంలో నశించిన దానిని వెదకి రక్షించడానికి ఈ లోకమునకు వచ్చానని చెప్పడం జరిగింది.

మనం నేను నీతిగానే బ్రతుకుతున్నాను. కాబట్టి నేను బాగానే ఉన్నాను అని భావించక శత్రువైన సాతాను చేత బంధించబడిన వారిని, దోచుకొనబడిన వారిని ప్రేమతో చేరదీసి వారి మనోవ్యధలను సరిచేయడానికి, హృదయ గాయములను కట్టడానికి ప్రయాసపడవలెనని ఈ సమరయుని జీవితం మనకు బోధిస్తున్నది. సమరయుడు తన ధనమును, తన సమయమును వెచ్చించి ఈ మంచి కార్యము చేసినట్లు మనం చూస్తున్నాం.

మన జీవితములలో అట్టి ఉన్నత స్థాయి ఆలోచనలను దేవుడు అనుగ్రహించును గాక !


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

**2015 ఆగష్టు 15వ తేది ఉపవాస ప్రార్థన**

దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,
కుటుంబముల ఆశీర్వాదము కొరకు దేవుని వేడుకుందాం.

**సమయం:** ఉదయం గం. 9.00 లకు
వివరములకు: **9666666249**


 చెయ్యాలన్న తాపత్రయం ఉంటే ఏ పనైనా సాధ్యమే...ఇప్పుడెందుకులే అనే బద్ధకం ఉంటే ఏదైనా అసాధ్యమే .......

## చదవండి – చదివించండి ; మారండి – జీవితమును ఆస్వాధించండి

1. అన్నిటికి మేమే పెద్దవారము గొప్పవారము అనే అహంభావం ప్రదర్శించకండి
2. అర్థం పర్థం లేకుండా పర్యవసానాలు ఏమిటో గ్రహించకుండా అనవసరంగా ఏదేదో మాట్లాడడం మానండి
3. ఏ వ్యవహారములోనైనా, తగాదాలోనైనా నేర్పుగా, ఓర్పుగా వ్యవహరించండి
4. కొన్ని సందర్భములలో కొన్ని సంకట పరిస్థితులను ఓర్పుగా సహించి ఉండాలని గ్రహించండి
5. మీరు చెప్పినదే సరైనది, మీరు చేసినదే సరైనది అని వాదులాడకండి. సంకుచిత మనస్తత్వాన్ని విడిచిపెట్టండి
6. ఏది నిజమో, అబద్ధమో సరిగా తెలుసుకోకుండా ఇక్కడ విన్నది అక్కడ, అక్కడ విన్నది ఇక్కడ మాట్లాడడం మానండి
7. మిగిలిన వారికన్నా మీరే గొప్పవారిమనుకుంటూ, మీ గురించి మీరు ఉన్నతంగా ఊహించుకుంటూ గర్వపడకండి.
8. అవతల వాళ్ళకు సంబంధం ఉన్నా, లేకపోయినా మీ పాటికి మీరు ప్రతి ఒక్కరి దగ్గరా అన్ని విషయములు చెప్పడమనే అలవాటు మానుకొండి
9. మీ చెవిన పడ్డంత మాత్రాన ప్రతి విషయమును నమ్మకండి, చిన్న చిన్న విషయములను పెద్దవిగా చేసుకోకండి.
10. మీరు చెప్పిందే సరైనది అంటూ మంకు పట్టు పట్టకండి. కాస్తంత పట్టువిడుపు చూపండి.
11. ఇతరుల మాటలనూ, చేతలను, జరుగుతున్న విషయములను తప్పుగా అర్థం చేసుకోకండి
12. ఇతరులతో మర్యాదగా వ్యవహరించడం, మర్యాదతో హృదయపూర్వకంగా మాట్లాడడం మరువవద్దు.
13. చిరునవ్వుతో పలకరించడానికి, ప్రేమగా మాట్లాడడానికి కూడా తీరిక లేనట్లుగా ప్రవర్తించకండి
14. మాటలలో కాని, చేతలలో కాని మర్యాద లేని పదాలు వాడకండి అనవసరమైన దర్పం చూపకండి. అణుకువ చూపుతూ, మంచిగా, మర్యాదగా వ్యవహరించండి.
15. ఏదైనా తగాదా వచ్చినప్పుడు అవతలి వాళ్ళే ముందుగా దిగి రావాలని ఎదురు చూడకండి, మీరే మాట్లాడడానికి ముందుకు రండి.

ఇంట్లోనైనా, ఆఫీసులోనైనా మానవ సంబంధములలో సమస్యలు రాకుండా ఒకటి, అర సమస్యలు వచ్చినా అవి గోరంతలు కొండంతలు కాకుండా సంబంధములు అభివృద్ధి చెందాలంటే మనము పైన ఉన్నవాటిని అనుసరించుట మంచిది.

# నోటి మాటలు

సిస్టర్ వి.విజయ

మన అనుదిన జీవితములో మాటలు ఎంతో ప్రాముఖ్యమైనవి అని గ్రహించేవారు కొద్దిమంది. మాటలలో మంచివి, చెడ్డవి రెండూ ఉంటాయి. మాటలు మానవ సంబంధములను, స్నేహభావములను పెంపొందించేవిగాను, అలాగే సంబంధములను నాశనం చేసేవిగాను ఉంటాయి. ఒక వ్యక్తి యొక్క వ్యక్తిత్వమును, ఉద్దేశ్యములను తెలియజేసేవి. ఎంత మంచి స్వభావము కలవారమైననూ, మంచి గుణము కలిగి, సహాయం చేసే మనసు ఎంతో ఉన్నతంగా ఉన్నవారమైననూ నోటి మాటలు సరిగా ఉండక, ఇతరులను గాయపరిచేవిగా ఉన్నట్లయితే ఎవరూ మనలను మెచ్చుకోరు. అందుకే యాకోబు వ్రాసిన పత్రికలో చెప్పబడినట్లుగా నాలుక చిన్న అవయవమైననూ బహుగా అదిరిపడును అని అది చిన్నదే అయిననూ మాటల విషయములో అదిరి పడకుండా జాగ్రత్త పడాలి.

**"నోట పడునది మనుష్యుని అపవిత్రపరచదు గాని నోట నుండి వచ్చునదియే మనుష్యుని అపవిత్రపరచునని వారితో చెప్పెను - మత్తయి 15:11**

నోటి లోపలికి వెళ్ళునది అపవిత్రపరచదు గానీ, నోటి నుండి వచ్చే మాటలు కీడులలోనికి తీసుకువెళ్ళి మనిషిని పతనం చేస్తాయి అని పరిశీలించుకోవాలి. మనం మాట్లాడే ప్రతి వ్యర్థమైన మాటని బట్టి తీర్పులోనికి వెళ్తాము అనే విషయమును గ్రహించాలి. దేవుని నమ్మిన మన జీవితములో వ్యర్థమైన మాటలన్నిటి నుండి విడిపించబడాలి.



**సజ్జనుడు తన హృదయమను మంచి ధననిధి నుండి మంచి మాటలను దుర్జనుడు తన హృదయమను చెడ్డ ధననిధి నుండి చెడ్డ మాటలను బయటికి తెచ్చును. హృదయము నిండిన దానిని బట్టి నోరు మాటలాడును - లూకా 6:45**

హృదయములో ఉద్దేశ్యములను బయటకు తీసుకు వచ్చే ఛానల్ నోరు. మంచి విషయములు మాట్లాడడానికి ఆసక్తి ఉండదు కానీ అనవసరమైన, సంబంధం లేని అనేక విషయములను మాట్లాడి సత్సంబంధములను కోల్పోతున్నామనేది వాస్తవమైన విషయం. నియంత్రణ లేకుండా మాట్లాడే మాటలే కదా నేడు కుటుంబములలో అనేక సమస్యలకు, గొడవలకు కారణం. కక్షలతో, మనస్పర్థలతో జీవిస్తూ, శత్రువులుగా భావించుకుంటూ వ్యగ్యంగా మాట్లాడే మాటల వలనే నేడు మానవసంబంధములన్నీ విచ్ఛిన్నం అవుతున్నాయి.

కొంతమంది క్రియలు మంచిగా ఉన్ననూ నియంత్రణని కోల్పోయి, మాట్లాడే మాటల వలన చెడ్డ పేరుని సంపాదిస్తారు. కొంతమంది వారికి కలుగుచున్న (ఎమోషన్స్‌ని) భావములను అదుపులో ఉంచుకొని, తొందరపడి మాట్లాడకపోవుట వలన గొప్పవారిగా మార్పు చెందుతారు.

**అందుకే పౌలు భక్తుడు తిమోతిని హెచ్చరిస్తూ చెప్పిన మాట "మరియు వారు ఇంటింట తిరుగులాడుచు, బద్ధకురాండ్రగుటకు మాత్రమే గాక, ఆడరాని మాటలాడుచూ, వదరుబోతులను పరులజోలికి పోవువారగుటకును నేర్చుకొందురు - 1 తిమోతి 5:13**

ఇంటింట తిరుగులాడుచు, వదరుబోతులుగా, ఆడరాని మాటలు మాట్లాడుచూ, కుటుంబములలోను, వ్యక్తుల మధ్య ఉన్న స్నేహభావములను చెడగొడుతూ ఉంటారు. ఇలాంటి మాటలు, వ్యక్తిత్వములు మన ఆత్మీయ జీవితమునకు నష్టం. అంతే కాక, ఎదుటి వారి హృదయములను గాయపరిచి, వారి సంబంధములను దెబ్బతీసిన వారమవుతాము.

మహాజ్ఞానియైన సొలొమోను పరిశుద్ధ గ్రంథమైన బైబిల్ సామెతల గ్రంథములో అనేక రకములైన మాటల గురించి వివరించాడు.

**మూర్ఖపు మాటలు నోటికి రానియ్యకుము**

**పెదవుల నుండి కుటిలమైన మాటలు రానియ్యకుము - సామె 4:24**

కుటిలమైన మాటలు అనగా మోసపు అబద్ధపు, కుట్రతో కూడిన మాటలు. ఇలాంటి మాటలు మనం మాట్లాడకూడదని దేవుని ఉద్దేశ్యము. మనం మాట్లాడి మర్చిపోతాము కానీ, ఎదుటి వారికి గుర్తుంటాయి. దేవుని దగ్గర కూడా రికార్డ్ అవుతాయి. వాటిని బట్టి మనకి జీవ మరణం.

**"ఒకని నోటి ఫలము చేత వాని కడుపు నిండును తన పెదవుల ఆదాయం చేత వాడు తృప్తి పొందును."**

**జీవ మరణములు నాలుక వశము దాని యందు ప్రీతిపడువారు దాని ఫలము తిందురు - సామె 18:20,21**

సరియైన మాట – ఒకరి బాధలను పోగొడుతుంది. మనకి జీవమును, మరణమును నిర్దేశించేది మన మాటలు. **"బుద్ధిహీనుని నోరు వానికి నాశనము తెచ్చును వాని పెదవులు వాని ప్రాణమునకు ఉరి తెచ్చును" - సామె 18:7**

మన నోరు మనలను నాశనం లోనికి నడిపిస్తుంది. పెదవులతో మాట్లాడిన అబద్ధం ప్రాణమునకు ఉరిగా మారుతుంది.

క్రొత్త నిబంధనా సంఘంలో విశ్వసించిన వారందరు ఏకహృదయముతో, ఏకాత్మతో తమకి ఉన్నది ఏది తమదని అనుకొనక సమిష్ఠిగా ఉంచుచూ ముందుకి వెళ్ళుచుండగా అననీయ, సప్పీరా ఏకమై పొలమమ్మి దాని వెలలో కొంత దాచుకొని కొంత తెచ్చి అపోస్తలుల పాదముల యొద్ద పెట్టెను. ఇంతకే దీనిని అమ్మితిరా ? అని అననీయను పేతురు అడుగగా అవును ఇంతకే అని అబద్ధం చెప్పెను. భూమి వెలలో కొంత దాచుకొని పరిశుద్ధాత్మను ఎందుకు మోసపుచ్చితిరని అనిన వెంటనే అననీయ అక్కడికక్కడే పడి ప్రాణం విడిచెను. వెంటనే వచ్చిన సప్పీరా కూడా పేతురు అడిగిన ప్రశ్నకు అవును ఇంతకే అని సమాధాన మిచ్చింది. వెంటనే ఆమె కూడా ప్రాణము విడిచెను. వారి పెదవులతో మాట్లాడిన అబద్ధం వారి ప్రాణమునకు ఉరిగా మారింది.

ఇలాంటి మాటలు వెంటనే మన జీవితములో ప్రతిఫలమును కలుగజేస్తాయి అని కాదు కానీ ప్రతి దినము ఇలాంటి మాటలు మాట్లాడటం అలవాటుగా మారుతుంది. ఇది మన మీదా, మన కుటుంబముల మీదా ఎంతో ప్రభావమును చూపించి, మనం మాట్లాడే ఏ మాట మీదా కూడా నమ్మకం లేని వారిగా తయారవుతాము. మంచి మాటలు ప్రభావం చూపించిననూ, చూపించకపోయిననూ చెడ్డ మాటలు మాత్రం ఎంతో ప్రభావం చూపుతాయి.

కనుక అనాలోచనతో కూడిన నోటి మాటలు ఎంత ప్రమాదకరమైనవో గ్రహించినవారమైతే, ప్రతి మాటను ఎంతో జాగ్రత్త కలిగి మాట్లాడతాము.


**ఎపఫ్రా మినిస్ట్రీస్ - వనస్థలిపురం**

**ఆదివారం ఆరాధన సమయం ఉదయం 10 గం.లకు**

**వర్డ్ & డీడ్ స్కూల్ (హయత్ నగర్) NH-9,**

**ఛాపెల్ ఆడిటోరియం నందు జరుగును.**

**అందరూ ఆహ్వానితులే....!**

**వివరములకు:**

9666666249 | 040-24202227



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 41వ భాగము**

విన్సెంట్ సుందర్‌తో గడిపిన కొద్ది దినములు ఎంతో స్ఫూర్తి దాయకముగాను, సవాలు చేసేవిగాను ఉన్నాయి. సుందర్ అక్కడి నుండి వెళ్ళిపోయే సమయం ఆసన్నమవడంతో తన చదువు కొనసాగించడానికై మరల కళాశాలకు వెళ్ళాడు విన్సెంట్. తర్జుమా చేయాల్సి ఉన్నది గనుక వెంటనే బయలుదేరి కొల్హాపూర్ రమ్మని మరల సాధువు నుండి వచ్చిన వార్తని చూచి, ఆనందంతో ఆ రాత్రే బండి పట్టుకొని ఉదయం 9 గంటలకు కొల్హాపూర్ చేరాడు విన్సెంట్. అప్పటి నుండి ఎడతెరిపిలేని కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. క్రైస్తవులు మాత్రమే గాక హిందువులు, మహమ్మదీయులు కూడ సందర్‌ను ఆహ్వానిస్తుండినారు. కొల్హాపూర్ చేరిన మరునాడే అచ్చుటికి 12 మైళ్ళ దూరములో 12 మంది గల ఓ చిన్న క్రైస్తవ గుంపు దగ్గరకు సుందర్‌తో కలసి వెళ్ళాడు. ఉత్తరాది నుండి ప్రఖ్యాతి గాంచిన సాధుసుందర్ సింగ్ వచ్చారని ప్రకటించగానే బ్రాహ్మణులు, మరాఠీలతో సహా 300 మంది ఆయనను చూడడానికి, వాక్యము వినడానికి వచ్చారు. ఇదే రక్షణ దినము అనే అంశము మీద సాధువు సందేశమును ఎలాంటి తడబాటు లేకుండా ఎంతో తేటగా తర్జుమా చేసి, ఇంతకు ముందు ఎన్నడూ ఇలాంటి వర్తమానం వినలేదని ఆశ్చర్యంతో చెప్పాడు విన్సెంట్. ప్రసంగం ముగించబడిన తరువాత కొందరు హైందవులు తమలో తాము చర్చించుకొని యేసు ప్రభువు ఒక్కడే రక్షకుడని నిజంగా ఇప్పుడే మాకు తెలిసిందని చెప్పి, వారిలో 9 మంది అప్పటికప్పుడే తమ భార్యపిల్లలతో సహా బాప్తిస్మం పొందుతామని చెప్పారు. సుందర్‌తో వచ్చిన మిషనెరీ వారందరికీ బాప్తిస్మమిచ్చాడు. సాయంకాలానికి మరో సంపన్న బ్రాహ్మణుడు కూడా క్రీస్తుని అంగీకరిస్తానని ముందుకి వచ్చాడు. సుందర్‌కి ఇది మరపురాని దినం. ఆ తరువాత తర్జుమా ద్వారా వర్తమానం విని ప్రజలు క్రీస్తుని అంగీకరించడం ఇంతకు ముందు ఎన్నడూ నేను చూడలేదని విన్సెంట్‌తో సుందర్ అన్నాడు. తర్జుమా సేవ కొరకు ప్రభువు నిన్ను పిలిస్తే, ఎన్నడూ నిరాకరించవద్దని విన్సెంట్‌తో చెప్పి, తరువాత ఓ నల్లని వెల్వెట్ స్కార్ఫ్ తీసి దీనిని నీకు బహుకరించుచున్నాను తీసుకోమంటూ చిరునవ్వుతో విన్సెంట్‌కిచ్చాడు. ఆ స్కార్ఫ్ మీద "పాపులను రక్షించుటకు క్రీస్తుయేసు లోకమునకు వచ్చెను" అనే మాటలు ఎర్రటి నూలుతో కుట్టబడి ఉన్నాయి. విన్సెంట్ దీనినెంతో ప్రశస్తంగా దాచుకున్నాడు. కొల్హాపూర్‌లో వారు చాలా రోజులుండినారు.

ఎందరెందరో వారిని ఆహ్వానించారు. ఒకసారి అచ్చటి హాస్టల్ బాలికలు బహిరంగ స్థలములో తాము పాడే పాటలను వినడానికై సుందర్‌ను ఆహ్వానించారు. ఆ రాత్రి చాలా చలిగా ఉంది. తనకి ఉన్న నూలు శాలువలోనే సుందర్ ముడుచుకొని కూర్చుండుట గమనించిన బాలికలు వెచ్చగా ఉండే ఖరీదైన శాలువను కొని సుందర్‌కు బహుకరించారు. కృతజ్ఞతా పూర్వకమైన సంతోషంతో దానిని స్వీకరించి కప్పుకున్నాడు. చివరి రాత్రి తిరిగి వస్తున్నప్పుడు ఓ వృద్ధుడు చిరిగిన బట్టలతో చలికాచుకోవడం చూచి, దానిని ఆ ముసలి వానికిచ్చాడు. సాధువు తన కొరకు ఏమీ ఉంచుకునే వాడు కాదు. ఎవరైనా డబ్బిస్తే వద్దనేవాడు. తరువాత ప్రయాణంచేయడానికి కావలసిన టికెట్ మాత్రం తీసికొనేవాడు. ఒకసారి కొందరు స్నేహితులు సుందర్ కోసమని 25 రూ॥ డబ్బు పొట్లాన్ని రైలు పెట్టెలోకి విసిరి వేశారు. దానిని ఒక స్టేషనులో రైలు ఆగినప్పుడు వచ్చిన భిక్షగాని చేతిలో పెట్టాడు సుందర్. తాను ప్రసంగించిన కూటములలో తన ఖర్చు కోసం చందా పట్టనిచ్చేవాడు కాదు సుందర్. దీర్ఘప్రయాణం చేసి ఒక ప్రాంతమునకు వెళ్ళిన తరువాత ఒక గంటలోనే పెద్ద కూటం ప్రారంభమౌతుందని ఆహ్వానితులు తెలియజేశారు. విన్సెంట్ సుందర్ దగ్గరకు వెళ్ళి విద్యాధికులైన పెద్ద జనసమూహం ముందు నిలువబడి తర్జుమా చేయాలంటే భయంగా ఉందన్నాడు. అందుకు సుందర్ అతనిని ధైర్యపరుస్తూ, “నీవేం భయపడవద్దు. తర్జుమా చేసేది నీవు కాదు, నీవు సేవించే ప్రభువే చేస్తాడు.మనం ప్రార్థన చేద్దాం” అని చెప్పి ప్రార్థించాడు. అది ఎంతో చిన్న ప్రార్థనే గాని ప్రేమా విశ్వాసములతో నిండినదై, నా హృదయంలోనికి దూసుకుపోయిందంటాడు విన్సెంట్. ఆరోజు సాయంకాల కూటములలోనే గాక మరుసటి రోజు జరిగిన 3 కూటములలో ప్రతిసారి గంటసేపు సుందర్ ప్రక్కన నిలబడి తర్జుమా చేశాడు. దీనితో పాటు సాధువును చూడాలని యెడతెరిపి లేకుండా వచ్చే ప్రజల ప్రశ్నలను తర్జుమా చేసి సుందర్‌కి చెప్తూ, సుందర్ మాటలను ప్రజలకు తెలియజేసేవాడు. విద్యాధికులైన హైందవులు సుందర్‌ని చూడడానికి వస్తుండేవారు. సాధువుని, నిరాడంబరమైన ఆయన యధార్థ జీవితమును చూచి వారాకర్షితులయ్యారు. ఆయన మాట్లాడే తీరు, నిస్వార్థం ఇవన్నీ ఆయన ప్రసంగాలు వినేవారి మీద ఎంతో సత్రృభావం కలిగించాయి. భారత క్రైస్తవులలో ఇలాంటి వాడు ఒకరుంటారని నేనెన్నడు తలంచలేదని ఒకరనడాన్ని విన్సెంట్ చెవులార విన్నాడు.

– సేకరించబడింది

(ఇంకా ఉంది)



# సోమరితనం

సెలవులు అయిపోయాయి, స్కూళ్ళు తెరిచారు, అంతా హడావిడి, పిల్లలంతా క్రొత్త యూనిఫామ్స్, బ్యాగ్స్ వేసుకొని సీతాకోక చిలుకల్లా తుర్రుమని వెళ్తుంటే స్కూల్స్ కళకళలాడుతున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లల చదువు కోసం ఏర్పాట్లలో బిజీగా ఉన్నారు.

కొందరు పిల్లలు అబ్బా! అప్పుడే సెలవులు అయి పోయాయి. ఇక పెద్ద వాళ్ళు ఇది చేయి, అది చేయి అంటారు. మనకిష్టం వచ్చినట్లు ఉండనివ్వరు అనుకుని తిట్టుకుంటూ ఉంటారు అలాంటి వాళ్ళకే ఈ స్టోరి ....

అనగనగా ఒక ఊరిలో శ్యామ్, రాజు అనే ఇద్దరు స్నేహితులు ఉండేవారు. ఒకరంటే ఒకరికి చాలా ఇష్టం. కానీ ఎప్పుడూ ఏదో ఒక కారణంగా ఇద్దరి మధ్యా వాదోపవాదాలు జరుగుతుండేవి. ఒకరోజు వాళ్ళిద్దరూ ఇంటి దగ్గర పార్కులో కూర్చుని తమ ఇష్టా – అయిష్టాల గురించి మాట్లడుకోవటం ప్రారంభించారు.

“నాకు ఉదయాన్నే నిద్రలేవటం అసలు ఇష్టం ఉండదు, కాని చదువుకోవడం కోసం లేవక తప్పటం లేదు” అని రాజుతో శ్యామ్ చెప్పాడు. అప్పుడు రాజు “అది చాలా మంచి అలవాటేగా బాధపడటం ఎందుకు?” అన్నాడు. పొద్దున్నే లేవటం, పళ్ళు తోముకోవటం స్నానం చేయటం, స్కూల్‌కి వెళ్ళటం, చదువుకోవటం ఇవన్నీ నాకు చాలా బోర్‌గా అనిపిస్తున్నాయి. నాకు ఇష్టం వచ్చినప్పుడు పడుకొని, ఇష్టం వచ్చినప్పుడు లేచి రోజంతా అటు ఇటు తిరుగుతూ ఆడుకుంటుంటే ఎంత బాగుంటుంది అనిపిస్తోంది” అన్నాడు శ్యామ్.“మనకి నచ్చినట్లుగా ఉండటం మంచిదే. కాని సోమరితనంతో బ్రతకడం మనకు, ఇతరులకు నష్టం కలిగిస్తుంది. క్రమశిక్షణ అనేది అవసరం.” అన్నాడు రాజు.

అందుకు శ్యామ్ ఒప్పుకోలేదు. చాలాసేపు ఇద్దరి మధ్య వాదన జరిగింది. ఇద్దరూ ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోయారు. శ్యామ్ తనకు ఇష్టం వచ్చినట్లు చేస్తూ ఎలాంటి క్రమశిక్షణ లేకుండా తల్లిదండ్రులకు ఇబ్బందికరంగా తయారయ్యాడు. రాజు ఎంత చెప్పినా తన పద్ధతి మార్చుకోలేదు గనుక ఎలాగైనా శ్యామ్‌లో మార్పు తేవాలనుకుని దేవుని సన్నిధిలో రోజూ ప్రార్థించేవాడు.

కొంతకాలానికి శ్యామ్ వాళ్ళ కుటుంబం కొద్ది రోజులు వేరే ఊరు వెళ్ళాల్సి వచ్చింది. శ్యామ్ వాళ్ళ అమ్మకి మొక్కలంటే ప్రాణం. ఆమె ఇంటి వెనుక ఉన్న ఖాళీ స్థలంలో

గులాబీ తోటను పెంచేది. శ్యామ్, రాజు ఇద్దరికీ ఆ తోటంటే చాలా ఇష్టం. వీలు దొరికినప్పుడల్లా గులాబీ తోటలోకి వెళ్ళేవారు. ఆ తోట బాధ్యతను రాజుకి అప్పగించారు. కొన్ని నెలల తర్వాత శ్యామ్ వాళ్లు ఊరి నుంచి తిరిగి వచ్చారు. రాగానే తోటలోనికి వెళ్ళి చూసుకున్నారు. గులాబీ మొక్కలన్నీ ఎండిపోయాయి. తోటంతా దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలతో నిండిపోయింది. అది చూసి శ్యామ్ తల్లి చాలా బాధపడింది. శ్యామ్‌కి విపరీతమైన కోపం వచ్చింది.

శ్యామ్ వెంటనే రాజు దగ్గరకు వెళ్లి, "నీకు తోట బాధ్యత అప్పగిస్తే ఇలా చేస్తావా, కొంచెంకూడా జ్ఞానం లేదు" అని చెడా మడా తిట్టాడు. అందుకు రాజు ఇలా అన్నాడు. "నువ్వు చెప్పిన మాటలు నువ్వు ఊరికి వెళ్లిన తరువాత బాగా గుర్తుకు వచ్చాయి. నేను కూడా ఎలాంటి క్రమశిక్షణ లేకుండా నీలాగే ఉంటే బావుంటుందనిపించింది. ఆ తోటలో మొక్కలు కూడా వాటి ఇష్టం వచ్చినట్లు పెరుగుతాయిలే అని వదిలేశాను. నా స్నేహితుడివైన నీ దారిలో నడవటం తప్పు కాదు కదా ! " అన్నాడు రాజు. శ్యామ్ తలదించుకొని వెళ్ళిపోయాడు. రాత్రంతా ఆలోచించిన తరువాత సోమరిగా ఉండడం ఎంత నష్టమో, క్రమశిక్షణ ఎంత ముఖ్యమైందో గ్రహించాడు. మరుసటి రోజు నుంచి అన్నీ క్రమశిక్షణగా చేయటం మొదలు పెట్టాడు. శ్యామ్‌లో వచ్చిన ఈ మార్పుకి తల్లిదండ్రులు చాలా సంతోషించారు. వాళ్ళ కన్నా ఎక్కువగా రాజు కూడా ఆనందించాడు.

శ్యామ్‌లో తాను కోరుకున్న మార్పు వచ్చినట్లు నిర్ధారించుకున్నాడు రాజు. ఒకరోజు శ్యామ్ దగ్గరకు వచ్చి "ఆ మొక్కలు అన్నీ చనిపోలేదు. వాటిని తీసుకువెళ్ళి మా ఇంటి వెనుక కుండీల్లో పెంచుతున్నాను, నీలో ఈ మార్పు కోసమే మీ తోటను అలా చేశాను" అని చెప్పి మొక్కలను తెచ్చి పెట్టాడు. శ్యామ్ ఇంట్లో వాళ్ళందరూ సంతోషించి, స్నేహితుడిలో మార్పు తీసుకురావడానికి రాజు చేసిన పనిని మెచ్చుకున్నారు.

చూశారా పిల్లలూ, రాజు ఆసక్తితో శ్యామ్ లో మార్పు కొరకు ప్రార్థించాడు. దేవుడు సహాయం చేశారు. మరి మీరు కూడా మీ తల్లిదండ్రులకు సంతోషాన్ని కలిగించే పిల్లల వలె క్రమశిక్షణ కలిగి సోమరితనమును విడిచి దేవునికి ప్రార్థిస్తారని మీ ప్రవర్తన అంతటి మీద అధికారము దేవునికి ఇస్తారని ఆశిస్తూ ..........

**– మీ అక్కయ్య**

# “నా జీవితములో దేవుని మేలులు”

**నిర్మల, శామీర్‌పేట**

నా పేరు నిర్మల. శామీర్ పేట్ మండలం, నేను క్రైస్తవ మధ్యతరగతి కుటుంబములో జన్మించాను. మేము ఆరుగురు అక్కచెల్లెళ్ళం, ఇద్దరు అన్నలు. నేను 5వ తరగతి వరకు చదివి మానేశాను. తరువాత స్పిన్నింగ్ మిల్‌లో పనికి చేరాను. కుటుంబమును ముందుకు ఎలా నడిపించాలో మా అమ్మకు ఏమీ తెలియదు. 1992లో మా నాన్న చనిపోయిన తరువాత మా బాధ్యతను పెద్దక్క, అన్నలు తీసుకున్నారు. మేము ఉంటున్న కంపెనీ క్వార్టర్స్‌లో ఒకరి ఇంట్లో ప్రార్థన జరుగుచుండగా ఒకరోజు వెళ్ళాము. ఆ సహవాసములో వెళ్ళుచూ, బలపడి 1993లో బాప్తిస్మం తీసుకున్నాను. తరువాత ఆదివారం ఆరాధనకు వెళ్ళడానికి సెలవు దొరికేది కాదు. ప్రార్థన చేసుకొని, మేనేజర్‌ని కలిసి అడిగినప్పుడు ఆదివారం సెలవు ఇచ్చారు. రోజుకి 4 అధ్యాయములు బైబిల్ చదివి సంవత్సరమునకు బైబిల్ పూర్తి చేశాను. ఆత్మీయముగా బలపడుతున్న సమయములో నాకు మా బావ తమ్ముడితో వివాహం చేయాలని పెద్దలు నిశ్చయించారు. అప్పుడు మా అత్తమ్మతో మీ అబ్బాయికి మారుమనస్సు ఉందా? రక్షణ పొందాడా ? విశ్వాసికి, అవిశ్వాసితో పొత్తు లేదు కదా? అని అడిగితే – మా అత్తమ్మ గొడవ చేసి వెళ్ళింది. మరల మా బావ వచ్చి సముదాయించి 2000 సం॥లో పెండ్లి చేశారు. నా భర్తకు వీలైతే చర్చికి వస్తారు. 2001 వ సంవత్సరములో నాకు కుమార్తె పుట్టింది. 2004 లో కుమారుడు పుట్టి చనిపోయాడు. 2005లో మా పెద్దన్నయ్య చనిపోయాడు. నాకు నెమ్మది లేదు, తెలియని ఆవేదనగా ఉండేది. “నేనే మార్గం, సత్యము, జీవము అన్న దేవుని మాటని బట్టి ధైర్యం తెచ్చుకొని, ఉపవాసముండి దేవుని సన్నిధిలో ప్రార్థన చేసుకుంటున్న సమయంలో కొన్ని కారణముల వలన మేము ఇంట్లో నుండి బయటకు వెళ్ళిపోవడం జరిగింది. ఎపఫ్రా మినిస్ట్రీస్ చర్చి ఎదురుగా అద్దెకి రూమ్ తీసుకొని ఉన్నాము. మా పక్కన ఉన్నవారు మందిరం ఎదురుగా ఉంది, రమ్మని చెబితే, నేను వెళ్ళాను.

ఆ రోజు దేవుని వాక్యంలో నుండి “లోకములో మీకు శ్రమ కలుగును అయినను ధైర్యంగా ఉండండి అని సేవకులు చెప్పారు. ఆ మాటలు నన్ను ఎంతగానో ధైర్యపరిచాయి. చదువు, జ్ఞానం తక్కువగా ఉన్న నాకు దైవసేవకులు చెప్పే వాక్యం ఎంతో చక్కగా అర్థం అవుతుంది. అలాగే స్త్రీల కూడికల వలన కూడా నాకు ఉన్న బలహీనతలను జయించగలుగుతున్నాను. సహవాసంలో చూపించే ప్రేమ ద్వారా

దేవుని ప్రేమను చూడగలుగుతున్నాను. దేవుని కృపను బట్టి మరో బిడ్డను మాకు అనుగ్రహించారు. ఉపవాసము ఉండి ప్రార్థన చేయగా దేవుడు చక్కని పరిచర్యను, అర్థవంతంగా నడిపించే దైవసేవకులను అనుగ్రహించాడు. అందును బట్టి దేవునికి స్తోత్రం. రెండు మూడు సంవత్సరాల క్రితం ఉపవాస ప్రార్థనలో దైవసేవకులు యెహోవా నా కాపరి, నాకు లేమి కలుగదు అని వాక్యం బోధించి ప్రతిరోజు ఆ మాటను చెప్పండి దేవుడు లేమి లేకుండ చేయును అని చెప్పారు. ఆ రోజు నుండి నేను ప్రతి ఉదయం నా పిల్లలతో నిద్రలేపుతూ యెహోవా నా కాపరి నాకు లేమి కలుగదు అని చెబుతాను వారు కూడా అదే మాట నాకు చెబుతారు. దేవుడు మా కుటుంబములో ఆర్థికంగాను, ఆరోగ్యంగాను లేమి లేకుండా చేయుచున్నాడు. నా భర్త క్రమంగా రానప్పటికి, సంపాదనలో దేవుని భాగం దేవునికి ఇచ్చుటకు మంచి మనస్సుని అనుగ్రహించినందుకు దేవునికి స్తోత్రములు. దేవుడు మాకు తోడుగా ఉండి మా ప్రతి అక్కరను తీరుస్తున్నారు.

జీవిత కాలమంతా కృతజ్ఞతగా నేను నా కుటుంబసమేతంగా దేవుని సన్నిధిలో నిలిచియుండునట్లుగా ప్రార్థన చేయండి.

## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com



# పరలోకం

"దేవుడు ఆకాశమందు ఉన్నాడు. నీవు భూమి మీద ఉన్నావు ...... నీ మట్టుకు నీవు దేవుని యందు భయభక్తులు కలిగి యుండుము"

**పరలోకం అంటే ఏమిటి?**

**1. పరలోకం దేవుని నివాసం :-**

"దేవుడు ఆకాశమంత మహోన్నతుడు కాడా? నక్షత్రముల ఔన్నత్యమును చూడుము. అవి ఎంత పైగా నున్నవి !" – యోబు 22:12

**2. పరలోకం దేవుని సింహాసన భవనం :-**

"యెహోవా ఆకాశమందు తన సింహాసనమును స్థిరపరచియున్నాడు. ఆయన అన్నిటి మీద రాజ్య పరిపాలన చేయుచున్నాడు." – కీర్తన 103:19

**3. పరలోకం దేవుని సంపూర్ణ మహిమ గల స్థలం :-**

"ఇంక సింహాసనములను వేయుట చూచితిని. మహా వృద్ధుడొకడు కూర్చుండెను. ఆయన వస్త్రము హిమము వలె ధవళముగాను, ఆయన తల వెంట్రుకలు శుద్ధమైన గొఱ్ఱెబొచ్చు వలె తెల్లగాను ఉండెను. ఆయన సింహాసనము అగ్ని జ్వాలల వలె మండుచుండెను. దాని చక్రములు అగ్ని వలె ఉండెను. అగ్ని వంటి ప్రవాహము ఆయన యొద్ద నుండి ప్రవహించుచుండెను" – దాని 7:9

**4. పరలోకం (విశ్వసించి) మరణించిన నీతిమంతుల గృహం :-**

"భూమి మీద మన గుడారమైన ఈ నివాసము శిథిలమై పోయినను, చేతిపని కాక దేవునిచే కట్టబడినదియు నిత్యమైనదియునైన నివాసము పరలోకమందు మనకున్నదని యెరుగుదుము" – 2 కొరింథీ 5:1

**5. పరలోకం విశ్వాసులందరి భవిష్యత్ గృహం :-**

"అటు తరువాత నేను చూడగా, ఇదిగో ప్రతి జనములో నుండియు, ప్రతి

వంశములో నుండియు ప్రజలలో నుండియు, ఆయా భాషలు మాటలాడువారిలో నుండియు వచ్చి, యెవడును లెక్కింపజాలని ఒక గొప్ప సమూహము కనబడెను. వారు తెల్లని వస్త్రములు ధరించుకొన్న వారై, ఖర్జూరపు మట్టలు చేత పట్టుకొని సింహాసనము ఎదుటను గొఱ్ఱెపిల్ల ఎదుటను నిలువబడి సింహాసనాసీనుడైన మా దేవునికిని గొఱ్ఱెపిల్లకును మా రక్షణకై స్తోత్రమని మహాశబ్దముతో ఎలుగెత్తి చెప్పిరి – ప్రక 7:9,10

పరలోకం మనం ఊహించడానికి అసాధ్యమైన స్థలం. "ఇప్పుడు అద్దములో చూచినట్టు సూచనగా చూచుచున్నాము. అప్పుడు ముఖాముఖిగా చూతుము. పరలోకం సంపూర్ణ మహిమతో, అనంతమైన పవిత్ర స్థలం. పరలోకం ఎలా ఉంటుందో అన్ని వివరాలనూ బైబిల్ వర్ణించకపోయినా దాని స్వరూపాన్ని గూర్చిన కొన్ని సూచనల్ని, గుర్తుల్ని తెలుపుతున్నది. అవి

**అది మహా మహిమగల స్థలం. "అప్పుడు నీతిమంతులు తన తండ్రి రాజ్యములో సూర్యుని వలె తేజరిల్లుదురు" (మత్తయి 13:43)**

అది నిరంతర ఆరాధనా స్థలం. "అటు తరువాత బహు జనుల శబ్దము వంటి గొప్ప స్వరము పరలోకమందు ఈలాగు చెప్పగా వింటిని. ప్రభువును స్తుతించుడి. రక్షణ మహిమ ప్రభావములు మన దేవునికే చెల్లును. అప్పుడు గొప్ప జన సమూహపు శబ్దమును, విస్తారమైన జలముల శబ్దమును బలమైన ఉరుముల శబ్దమును పోలిన ఒక స్వరము – సర్వాధికారియు ప్రభువునగు మన దేవుడు ఏలుచున్నాడు; ఆయనను స్తుతించుడి" (ప్రకటన 19:1-6)

దుష్టత్వం చేత కళంకితం కాని స్థలం. "గొఱ్ఱెపిల్ల యొక్క జీవగ్రంథమందు వ్రాయబడిన వారే దానిలో ప్రవేశింతురు గాని నిషిద్ధమైనదేదైనను, అసహ్యమైనదానిని అబద్ధమైనదానిని జరిగించువాడైనను దానిలోనికి ప్రవేశింపనే ప్రవేశింపడు. (ప్రకటన 21:27)

పరలోకం నుండి వస్తున్న నూతన యెరూషలేమును ప్రకటన గ్రంథం వర్ణించింది. అది ఆ క్రింది వేవీ ఉండని ప్రదేశం

**రాత్రి, శాపం, వేదన, దుఃఖం, ఏడుపు, మరణం :-**

"ఇక మీదట శాపగ్రస్తమైనదేదియు దానిలో ఉండదు, దేవుని యొక్కయు గొఱ్ఱెపిల్ల యొక్కయు సింహాసనము దానిలో ఉండును. రాత్రి యికనెన్నడు ఉండదు; దీపకాంతియైనను సూర్యకాంతియైనను వారికి అక్కరలేదు; దేవుడైన ప్రభువే వారి మీద ప్రకాశించును. వారు యుగయుగములు రాజ్యము చేయుదురు. – ప్రకటన 22:3,5

పరలోకములో ఇవేవీ ఉండకపోవడానికి కారణం, పరలోకం దేవుని స్వభావపు ప్రతీక కావడమే. పరలోకం దేవుని స్వరూప సాన్నిధ్యాలు పూర్తిగా వ్యక్తమయ్యే స్థలం గనుక అది పూర్తి మహిమతో, అనంతమైన నిరంతరమైన పవిత్ర స్థలం వంటిది.

# సులభమైన ప్రార్థన యొక్క శక్తి

**అటువలె ఆత్మయు మన బలహీనతను చూచి సహాయము చేయుచున్నాడు. ఏలయనగా మనము యుక్తముగా ఏలాగు ప్రార్థన చేయవలెనో మనకు తెలియదు గాని, ఉచ్చరింప శక్యము కాని మూలుగులతో ఆ ఆత్మ తానే మన పక్షముగా విజ్ఞాపనము చేయుచున్నాడు - రోమా 8:26**

మనము విలువ లేని వారముగా లేక సిగ్గుగా భావించుట వలన దేవుని దగ్గరకు నమ్మకంగా చేరలేము. అర్హత లేని వారముగా భావించుటలో ఇది రెండవ రకమైయున్నది. కొంతమంది అయితే, ఇప్పుడు మేము 'బాగున్నాము', ఈ రోజు దేవుడు మా ప్రార్థన వింటాడు అని తలంచిన దినములలో మాత్రమే ప్రార్థిస్తారు. ఈ ఆలోచనలన్నీ సాతాను యొక్క అబద్ధములై యున్నవి. ఇది సత్యం, మనము మన స్వంత బలంతో యోగ్యంగా ప్రార్థించుట ఎరుగము. మన స్వంత బలముతో దేవుని యొద్దకు వెళ్ళలేము. మనము యేసుక్రీస్తు యొక్క నీతితో దేవుని యొద్దకు వెళ్తున్నాము. యేసు ద్వారా మనం నీతిమంతులముగా చేయబడ్డాము. పరిశుద్ధాత్మ మన కొరకు విజ్ఞాపన చేస్తున్నాడు. యేసు జీవించి మన కొరకు విజ్ఞాపన చేయుచున్నాడని, మన ప్రార్థనలను వింటున్నాడనే సత్యం మాత్రమే నమ్మకముతో ఆయన యొద్దకు చేరగలిగే ధైర్యాన్నిస్తుంది. ఆయన మన కొరకు దాచి ఉంచిన ఆశీర్వాదమును కేవలం మనం అడగవలసి ఉన్నది.

కొన్నిసార్లు మనుష్యులు తమని గురించి తాము మంచిగా భావించక ఆత్మీయముగా అర్హత లేనివారమేమోనని, తాము చెడుగా ఉన్నాము గనుక దేవుడు తమ ప్రార్థనలు వినరేమో, దేవుని ఆశీర్వదించమని అడుగుట కూడా సరియైనది కాదని తలుస్తారు. దేవునిని అడగడానికి అర్హులము కాదు అనే తలంపులు మనకి వస్తున్నప్పుడు పరిశుద్ధాత్మ సహాయాన్ని కోరాలి. "గనుక మనం కనికరింపబడి, సమయోచితమైన సహాయము కొరకు (మనకు అవసరమైనప్పుడు, సరియైన సమయములో) కృప పొందునట్లు ( మన అపజయములకై) ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదుము" అని హెబ్రీ పత్రిక 4:16 లో చెప్పబడినట్లుగా చేయవలెను. మనం విన్నపములు చేయునప్పుడు యేసు రక్తము ద్వారా నీతిమంతులముగా తీర్చబడిన కుమారులు, కుమార్తెలము అని మన స్థానమును అర్థము చేసుకోవాలి. మనం తరచుగా మన నీతి మన సరియైన మాటలపై, మన సరియైన ప్రవర్తనపై మన సరియైన ఉద్ధేశాలపై ఆధారపడి ఉందని తలుస్తాము. మనలను మనం మతసంబంధిగా చేసుకొనగలం కానీ, మనల్ని మనం నీతిమంతులముగా చేసుకొనలేము. ప్రతీది సరిగా చేయుటకు నీతితో ఏ సంబంధం లేదు గానీ, యేసు కార్చిన రక్తం మనలను అనీతి నుండి

కడుగుతుంది గనుక మనం నీతిమంతులముగా తీర్చబడతాము అనే విషయములను మనం నమ్మాలి. దానిని నమ్మనంత వరకు దేవుని దగ్గరకు ధైర్యంగా చేరలేము. యేసు మనలను నీతిమంతులుగా చేశాడను సత్యం క్రొత్త నిబంధన అంతటిలో చూస్తాము. వాటిలో కొన్ని:-

- "ఎందుకనగా మనమాయన యందు దేవుని నీతి అగునట్లు (ఆయన మంచితనము ద్వారా, దేవునితో సరియైన సంబంధం కలిగి ఉండునట్లుగా) పాపమెరుగని ఆయనను మన కోసము పాపముగా చేసెను" (2 కొరింథీ 5:21)
- "కాబట్టి తీర్పు ఒక్క అపరాధమూలమున వచ్చినదై, మనుష్యులకందరికిని శిక్షా విధి కలుగుటకు ఏలాగు కారణమాయెనో, ఆలాగే ఒక్క పుణ్యకార్యము వలన కృపాదానము మనుష్యులకందరికిని జీవప్రదమైన నీతి విధింపబడుటకు కారణమాయెను." "ఏలయనగా ఒక మనుష్యుని అవిధేయత వలన అనేకులు పాపులుగా ఏలాగు చేయబడిరో, ఆలాగే ఒకని విధేయత వలన అనేకులు నీతిమంతులుగా చేయబడుదురు." (రోమా 5:18-19)
- "నేను దేవుని కృపను నిరర్థకము చేయను; నీతి ధర్మశాస్త్రము వలననైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే" (గలతీ 2:21)
- "విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియైయున్నాడు" (రోమా 10:4)
- "ఏ భేదమును లేదు, అందరును పాపము చేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు. "కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు." (రోమా 3:23,24)

మనలను మనం నీతిమంతులుగా చేసుకొనుటకు ఏమీ చేయనవసరం లేదు అని, దేవునికి ఏమీ మనలను మనం ఋజువు చేసుకోనవసరం లేదనియు గ్రహించినప్పుడు, యేసు మనకిచ్చు నీతి అను బహుమానములో విశ్రాంతి పొందుతాము - మరియు మన మనవిలో ధైర్యమును పొందుతాము. మనము మంచివారమైనందు వలన ఆయన మన ప్రార్థనకు జవాబు ఇవ్వడం లేదు కానీ, ఆయన మంచివాడు గనుక ఆయన మన ప్రార్థనలు విని, మనకు జవాబు ఇస్తున్నారు.

(ఇంకా ఉంది)

- సేకరించబడింది

# ఆశావాది

## ఆశావాది

1. ద్వేషించేవారిలో కూడా ప్రేమను చూస్తాడు
2. క్రిందపడినా లేవడానికి ప్రయత్నం చేస్తాడు
3. చీకటిలో కూడా వెలుగు కొరకు చూస్తాడు
4. ప్రతి కష్టంలోనూ అవకాశాన్ని చూస్తాడు
5. ఉన్న స్థితిని బట్టి సంతోషం కలిగి ఉంటాడు
6. దుఃఖపడుతూ కూడా సంతోషం కలుగుతుందని ఎదురుచూస్తాడు
7. ఆనందంగా ఉంటాడు, తోటివారిని ఆనందంగా ఉంచుతాడు
8. దీవెనకరమైన మాటలు పలుకుతాడు
9. ప్రయత్నిస్తే సాధించలేనిది ఏదీ లేదని నమ్ముతాడు

## నిరాశావాది

1. ప్రేమించేవారిని కూడా అనుమానిస్తాడు
2. నిలిచియున్నా పడిపోతానని భయ పడతాడు
3. వెలుగుపోయి చీకటివస్తుందని ఆందోళన పడతాడు
4. ప్రతి అవకాశంలోనూ కష్టాన్ని చూస్తాడు
5. లేని స్థితిని తలంచుకొని కుమిలిపోతాడు
6. సంతోషించే సమయంలో కూడా దుఃఖసమయం వస్తుందేమోనని ఏడుస్తుంటాడు
7. ఆనందంగా ఉండడు, తోటివారిని ఆనందంగా ఉండనివ్వడు
8. శాపకరమైన మాటలు పలుకుతాడు
9. సాధించకపోతే ప్రయత్నములు



# ఓటమి బాధ్యత

మన జీవితములోని అసౌకర్యములు లేక ఇబ్బందులు మనలను విధేయులనుగాను, (వినయులుగాను) చేయును. మంచి దైవభక్తి గలిగి, చాలా విజయవంతమైన అమెరికా దేశాధ్యక్షులలో అబ్రహాం లింకన్ (1809–1865) ఒకరు. ఆయన కష్టములతో కూడిన బాల్యము గడిపెను. ఒక సంవత్సరము కూడా సరిగా స్కూలుకు వెళ్ళడం జరగలేదు. 1831 లో బిజినెస్ లో, 1832 లో ఎలక్షన్‌ల లోను ఓడిపోయెను. మరుసటి సంవత్సరము మరల వ్యాపారంలో నష్టపోయెను. తనతో పెండ్లి నిశ్చయమైన అమ్మాయి 1835 లో చనిపోయెను. 1838 లో స్పీకరు పదవికి పోటి చేసి ఓడిపోయెను. భార్య అతనికి ఎంతో భారము కల్గించేదిగా ఉన్నది. తన నలుగురు కుమారులలో ఒక్కడు మాత్రమే 18 సంవత్సరాలు పైబడి బ్రతికెను. ఇంకా ఓటమి అనేక విధములుగా అతని జీవితంలో ఉండెను కాని 1860 లో ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికా గా ఎన్నిక అయ్యెను.

ఓటమి పొందనివారు ఈ లోకంలో ఎవరు లేరు. దేవుని ప్రేమించు వారిని ఓటమి ఏమీ చేయలేదు. ఓటమి, బాధలు, నష్టములు, నిరాశలు ఇవన్నీ ఒకే వరుసలో ఉంటాయి. ఇవి అన్నియు మనకు విధేయత నేర్పడానికి ఉపయోగపడే సాధనములు అని అనుకోవచ్చు. దేవుడు మనలను ఎందుకు ఈ విధంగా కష్టాల గుండా, నిరాశా జనకమైన పరిస్థితుల గుండా తీసుకువెళతాడు అని మనము గమనిస్తే, **మరియు శరీర సంబంధులైన తండ్రులు మనకు శిక్షకులై యుండిరి. వారియందు భయభక్తులు కలిగి యుంటిమి; అట్లయితే ఆత్మలకు తండ్రియైన వానికి మరి యెక్కువగా లోబడి బ్రదుకవలెను గదా? - హెబ్రీ 12:9** యేసయ్యకు కూడ ఈ అనుభవము తప్ప లేదు. దేవుని కుమారుడు మనుష్య కుమారుడిగా శ్రమల పాఠశాల యందు అత్యుత్తమ ప్రతిభ కనపరచి మొదటివాడిగా నిలిచాడు. **ఆయన, కుమారుడైయుండియు తాను పొందిన శ్రమల వలన విధేయతను నేర్చుకొనెను - హెబ్రీ 5:8** కొన్ని అరుదైన సందర్భములలో తప్ప, సాధారణముగా మన జీవితములలో ఓటమికి కారణము దేవుని వాక్యమునకు లేక దైవ చిత్తమునకు చూపే అవిధేయతే. ఓటమిలే మనలను దేవుని వైపు త్రిప్పే సాధనములు. ఓటమి మనలను మోకాళ్ళ పైకి వచ్చేటట్లుగా చేస్తుంది. తరచుగా పొందే ఓటమి మనలను దేవుని ముందు సాష్టాంగ పడేటట్లు చేస్తుంది. మనము ఓటమి నుండి నేర్చుకోకపోతే ఎప్పుడూ ఓడిపోతూనే ఉంటాము. హెన్రీఫోర్డ్ మొదటి కారు తయారు చేసిన సందర్భములో రివర్స్ గేర్ అమర్చాలని గ్రహించలేకపోయాడు. ఆ తరువాతి కాలంలో తప్పు మరలా ఎవరూ చేయలేదు. కీర్తనాకారుని మాటలను మనము గమనిస్తే **శ్రమకలుగక మునుపు నేను త్రోవ విడిచితిని ఇప్పుడు నీ వాక్యము ననుసరించి నడుచుకొనుచున్నాను. నేను నీ కట్టడలను నేర్చుకొనునట్లు శ్రమనొంది యుండుట నాకు**

**మేలాయెను - కీర్తన 119:67,71** ఓటములు మన దురహంకారమును అణచి, విధేయతను పెంపొందింపచేస్తాయి. మనము జాగ్రత్తగా పరిశీలించుకుంటూ జీవితంలో ముందుకు వెళ్తే ఎన్నో విషయములు ఓటమి ద్వారా నేర్చుకోవడం జరిగిందని ఒప్పుకుంటాం. కొన్ని తప్పులు మన ప్రమేయం లేకుండా జరుగుతాయి కాని మనము ఎదుర్కొనే అనేక అపజయములకు మనమే కారణం. సరియైన దృష్టితో విశ్లేషించినప్పుడు మనము ఏ విధంగా శ్రద్ధతో మెలగాలో అవి మనకు నేర్పుతాయి.

మనము ఎన్నో ఆర్టికల్స్, వాక్యములు చదువుతూ, వింటూ ఉంటాము కాని జీవితములో వాటిని అన్వయించుకొనుట చాలా అరుదు. నిజముగా అలా అన్వయించుకునే వారే జీవితం యొక్క మాధుర్యాన్ని అనుభవిస్తూ ఉంటారు. దేవుని ప్రణాళికలను చక్కగా గుర్తించి దేవునిలో బలవంతులుగా మార్చబడతారు.

అట్టి ధన్యత మనకు కలుగును గాక !






# బైబిల్ క్విజ్ - 41

(న్యాయాధిపతులు)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** వేశ్య కుమారుడు పరాక్రమం గల బలాఢ్యుడైన న్యాయాధిపతి ఎవరు?

**2.** గిద్యోను పనివాడు ఎవరు?

**3.** సూచనని కనుపరచమని దేవుని అడిగిన న్యాయాధిపతి ఎవరు?

**4.** 'ఏడ్పు' అనే అర్థమిచ్చే పదం ఏది?

**5.** దేవుడు ఇశ్రాయేలీయులును ఎవరికి అమ్మాడు?

**6.** ఏ గోత్రం ఇశ్రాయేలీయులలో నుండి కొట్టి వేయబడింది?

**7.** గిద్యోనుకు గల మరోపేరేమిటి?

**8.** కనానీయులపై పోరాడడానికి మొదట ఏ గోత్రం వెళ్ళింది?

**9.** ఇశ్రాయేలీయులలో మొదటి న్యాయాధిపతి ఎవరు?

**10.** తన అరవై మంది పిల్లల పెండ్లికి ఏర్పాట్లు చేసిందెవరు?

**ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు ఆగష్టు 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు సెప్టెంబరు 2015 పత్రికలో ప్రచురించబడతాయి.**

**పంపవలసిన చిరునామా - ఎడిటర్ - స్పర్శ, ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలతకాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070**

**<u>బైబిల్ క్విజ్ - 40 జవాబులు (యెహోషువ)</u>**

1. మక్కేదా గుహ (10:16)
2. అమోరీయుల, కనానీయుల రాజులందరికి (5:1)
3. తిమ్నత్సెరహు (19:50)
4. అక్సా (15:17,18)
5. షెకెములో (24:25)
6. గిల్గాలు (5:9)
7. కెదెషు, షెకెము, హెబ్రోను, బేసెరు, రామోత, గోలాను (20:7,8)
8. ఆకాను (7:24)
9. నూట పది సం॥లు (24:29)
10. ఆదాము పురము (3:16)

**<u>బైబిల్ క్విజ్ - 40 ప్రశ్నలకు సరియైన జవాబులు రాసి పంపిన వారి పేర్లు:</u>**

రాజు ఫ్లోరెన్స్, శాంతి ప్రియ, కనికరమ్మ, రూప, కవితా మాధురి, సుధారాణి, సుశీల, సౌజన్య, విఠల్, శ్రీకాంత్ (మల్లవోలు)

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## జూలై - ఆగష్టు

**భాగ్యలత:** సాంబశివరావు, రజని, సంధ్యారాణి, శారమ్మ, మాధవిలత, శ్రీలక్ష్మి, అక్షయ, ఎస్తేరు, రమేష్, గోపిచంద్, సరస్వతి, వినీత, ఇంద్రమ్మ, గంగాధర్, సాత్విక్, ఖ్యాతిపద్మిని, హరిబాబు, సుకుమార్, రూఫస్, అతిశయ్, గురుస్వామి, శ్రీనివాసరావు, దుర్గాప్రసాద్, ప్రశాంతవర్మ, రామకృష్ణ, పాపమ్మ, రాజేష్, వినయ్, శ్వేత, నవీన్, షర్మిల, శ్రావణి, హైమావతి, బ్యూలాఅనంతలక్ష్మి, మణెమ్మ, విశ్వాస్, సుగంధ్, కిషోర్‌కుమార్, ప్రణీత, నయోమి, సామ్యేల్, పవన్‌కుమార్, స్పర్జన్, దుర్గ, సుశీల్‌చంద్ర, రత్నం, ప్రమోద్, ఆనంద్, నరసింహ, విజయ్‌రాజు, ప్రభాకర్, కనకరాజు, ప్రతిభ, ప్రసాద్, అనూరాధ, అవని, స్ప్లెండిడ్ నెహెమ్యా, మాధవి, దివ్య, రాజేశ్వర్రావు, విమలాగ్రేస్, హరీష్, గణేష్, జ్యోతి, పర్ణిక, వాణి, రమేష్‌కుమార్, సుబ్బారావు, పాల్ వినయ్, ప్రకాష్, కీర్తి, షారోన్‌బాబు, యెషయా, రమ్యవర్మ, భానుప్రకాష్, సుజన, బ్యూలా, దినకరన్, నాంచారమ్మ, విజయలక్ష్మి, దివ్యవాణి, పాపారాణి, మణికంఠ, తరుణి, కావ్య, రూత్‌ప్రమీలారాణి, జోసెఫ్, సైదులు, సుభాష్, సుశాంత్, శిరీష, ఉన్నత్, శ్రీకాంత్, ఆశ్రయ్, రత్నకుమారి, సురేష్, రమాదేవి, అరుణ, లావణ్య, రాజశేఖర్, ప్రసన్నకుమారి, సంతోష్, హెూమి, నిఖిల్, రమ్య, సత్యమ్మ, రజని, ప్రశాంత్, వీణ.

**చింతల్:** జీవన్, గణేష్, అఖిల, సుధాకర్, కోమలి, రవిబాబు, వెంకటేశ్వర్రావు, సౌజన్య, శ్రీనివాసరావు, ప్రశాంతి, జశ్వంతరావు, నాగాంజనేయులు, షైనీ, విజయ, శిల్ప, సోనీ, సుమంత్, కార్తీక్, తేజస్విని, పరిశుద్ధరావు, రాము, ప్రవీణ్, దివ్య, శివ, భగత్ వర్మ, ప్రభాకర్, అజయ్‌కుమార్, వెంకటలక్ష్మి, శ్యామ్‌కుమార్, నాగరాజు, వీణ, కాలేబు, దీపిక, సత్యం, దీవెన, నిరీక్షణ్, వెంకటరమణ, అరుణ, శ్రీనివాస్, ఆనంద్‌బాబు, షీబారాణి, చిట్టెమ్మ.

**అనాజ్‌పూర్:** థామస్‌పీటర్, నీలిమ, కిరణ్, స్వాతి, కృపావరం, హేమలత, రూతు, శ్రీకాంత్, సంజీవ్, షాలేమురాజు, జాన్సన్, సిద్ధు, మణి, సౌజన్య, జ్యోతి, విజయలక్ష్మి

**ఇ.సి.ఐ.యల్:** వెంకటేశ్వర్రావు, విజయ్‌కుమార్

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

మీ ప్రార్థనావసరతలు:

____________________

____________________

____________________

____________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227

# జాన్ బన్యన్



జాన్‌బన్యన్ క్రీ.శ.1628 నవంబర్ నెలలో ఇంగ్లాండ్ లోని బెడ్‌ఫోర్డ్ పట్టణమునకు సమీపమున గల ఎల్‌స్టో అను గ్రామములో జన్మించెను. ఇతని తండ్రి లోహపాత్రలను బాగుచేయు "టింకర్" వృత్తి చేసి బన్యన్‌కి కూడా దానినే అప్పగించాడు. చిన్నతనము నుండి బన్యన్ ఆదివారం జరిగే ఆటపాటలలో రింగు లీడర్‌గా ఉంటూ, మొండి ధైర్యంతో దేవునికి దూరంగా జీవిస్తూ ఉండేవాడు. ఈ విధముగా ఆటలాడుచున్న సమయములోనే ఒక శబ్దము అతనితో "నీవు నీ పాపములను విడిచి పరలోకమునకు వెళ్ళెదవా ? లేక పాపములతోనే నరకమునకు వెళ్ళెదవా ?" అనెను. ఆ శబ్దము విని బన్యన్ మిక్కిలి భయపడి "నేను మహా పాపిని, క్రీస్తు నన్ను క్షమించడు, పాపములను విడిచిపెట్టిననూ దౌర్భాగ్యుడనే, అనుసరించిననూ దౌర్భాగ్యుడనే పాపములు ఎక్కువైతేనేమి, తక్కువైతేనేమి అనుకొని తన బాధను నిరాశచేత తప్పించుకొనగోరెను.

క్రీ.శ 1644 నుండి 1647 వరకు బన్యన్ పార్లమెంటు సైన్యములో పని చేసెను. సైన్యములో ఉన్నప్పుడు అతని ప్రక్కన నిలువబడి కావలి కాయుచున్న తోటి సైనికునికి తలలో తూటా దూసుకొని పోయెను. అది తన పాపములను, ఆత్మస్థితిని గురించి దీర్ఘముగా ఆలోచన చేయుటకు బన్యన్‌ను ప్రేరేపించి ఆత్మీయంగా జీవించవలెనని కోరుకొనెను.

బన్యన్ యుద్ధం నుండి తిరిగి వచ్చిన తరువాత దైవభక్తి గల ఒక స్త్రీని వివాహము చేసుకొనెను. వివాహం అయినప్పుడు ఆమె తండ్రి తన కుమార్తెకు ఏమీ ఇవ్వలేనప్పటికి, రెండు క్రైస్తవ పుస్తకములను బహుమానంగా ఇచ్చెను. అవి బన్యన్‌కు క్రైస్తవ్యము యెడల మరింత ఆసక్తి పెరుగుటకు ప్రేరణ నివ్వగా 1653వ సం॥లో బాప్టిస్టు చర్చినందు బాప్తీస్మము తీసుకొని, 1657వ సం॥లో తన జీవితమును దేవుని సేవకై అప్పగించుకొనెను. అతి తక్కువ కాలంలోనే గొప్ప ప్రసంగీకుడుగా పేరు పొంది, వాక్యపరిచర్య ద్వారా సువార్తను ప్రకటిస్తూ గొప్ప జనసమూహములను దేవుని వైపుకు త్రిప్పెను. ఈ విధంగా వాడబడుచున్న సమయంలో అతనిని పోలీసులు అరెస్ట్ చేసిరి. దేవుని గూర్చి ప్రకటించుట ఆపివేస్తే వదిలిపెడతాము అనే అవకాశమును ఇచ్చిననూ, అరెస్ట్ కావడం కూడా దేవుని చిత్తమని భావించి కోర్టు ముందు నిలబడెను. చెరసాలలో ఉన్న ఆ సమయములోనే అతడు పరలోక పట్టణమునకు క్రైస్తవుని ప్రయాణము అందలి ఇతివృత్తమును వివరించుచు "యాత్రికుని ప్రయాణము" అను పుస్తకము రచించెను. ఈ పుస్తకం నేటివరకు క్రైస్తవ నవలా గ్రంథములలో ప్రాముఖ్యమైనదిగా ప్రాచుర్యం పొందెను. జైల్‌లో ఉండి ఇంచుమించుగా 12 పుస్తకములను రచించెను. ప్రజలకు సేవచేయుటలో మిక్కిలి సంతోషమును పొందిన జాన్‌బన్యన్ బెడ్‌ఫోర్డ్‌లోని తన ప్రియ సంఘముతో జీవితము యొక్క చివరి సంవత్సరములు గడిపెను. జాన్‌బన్యన్ ఒక తండ్రి కొడుకుల మధ్య వచ్చిన వివాదమును తీర్చుటకు వెళ్ళి వచ్చుచూ, భీకర తుఫానులో చిక్కిననూ క్షేమముగా ఇంటికి చేరెను, కానీ జ్వరముతో బాధపడి 1688వ సం॥లో ఆగస్టు 31న తన విశ్వాస పోరాటము ముగించి దేవుని సన్నిధికి చేరెను.

2015, జూన్ 1,2,3 తేదీలలో జరిగిన విశ్వాసుల కూడికలకు
సంబంధించిన ఛాయాచిత్రములు





# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org

*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras